# అబ్బాయే పుడతాడు - అచ్చం నాన్నలాగే ఉంటాడు

రచన : బి. సక్కుబాయి

శరవేగంగా మెట్లెక్కి వచ్చిన మోహన్ గదవ దగ్గరే ఆగిపోయాడు. లోపలగదిలో జడ అల్లుకుంటూ రాధ క్యాలెండరులోని వనివాసి ఫోటోనుచూస్తూ "అబ్బాయే పుడ్తాడు అచ్చం నాన్నలాగే వుంటాడు" అని తన్మయత్వముతో పాడుతోంది. అక్కడే నిలబడి యున్న మోహన్ మదిలో మెరుపులాటి ఆలోచన వచ్చింది. ఆనందము పట్టలేక పోయాడు. "అమ్మాయే పుడ్తుంది-అచ్చం అమ్మలాగే ఉంటుంది. అంటూ లోపలికివెళ్ళి రాధను చుట్టివేశాడు,

'అబ్బా వదలండీ! ఎంతసేపయినది మీరు వచ్చి?' అన్నదిరాధ మోహన్‌ను తప్పించుకుంటూ.

'ఇప్పుడే వచ్చాను రాధా! నీ వంటున్నది నిజమేనా అన్నాడు మోహన్ ఆనందంగా.

'ఔను సిగ్గుతో దోసిట్లో ముఖం దాచుకుందిరాధ.

ఎంత మంచి వార్త చెప్పావు రాధా! కాని నాకు ఆడపిల్లేకావాలి.' అన్నాడు మోహన్ ముఖానికి అడ్డుగా పెట్టుకున్న దోసిలి విడదీస్తూ.

'ఊహూ నాకు అబ్బాయేకావాలి' అన్నది రాధ బుంగమూతిపెడుతూ ఆ బుంగమూతిచూస్తే ముచ్చటగా వుంటుంది మోహన్‌కు" భార్య భర్తలలో ఎవరో ఒకరు రాజీకి రావాలికదా! సరే నీయిష్టప్రకారమే కానివ్వు. కాని, వాడికి నీ పోలికలే రావాలి సుమా! అన్నాడు. మోహన్ రాధ బుగ్గమీద చిటికె వేస్తూ.

'నా ప్రతి అణువులో మీరూపమే నిండివున్నప్పుడు మీరూపము రాక, నారూపము వస్తుందా?' అన్నది రాధ చిరునవ్వుతో.

భార్యకు తనమీదున్న మమకారానికి ఉప్పొంగిపోయాడు మోహన్. 'రాధా! నీ లాటి భార్యను పొందటము నా అదృష్టము. అన్నాడు ఆమెను అక్కున చెర్చుకుంటూ.

'ఏమండీ! మన అబ్బాయికేమి పేరు పెడ్తాము?' అన్నది రాధ 'కీడెంచి మేలెంచమన్నారు పెద్దలు. నీకు అబ్బాయే పుడ్తాడని గ్యారంటీ యేమిటి? అందుకే ఒకపేరు సెలక్టు చేద్దాము. ఇటు ఆడవాళ్లకు అటు మగవాళ్ళకు సరిపోయే విధంగా అన్నాడు మోహన్ నవ్వుతూ.

'నాకు తప్పకుండా అబ్బాయే పుడతాడండీ! అన్నది రాధ విసుగ్గా.

'సరే మంచిదే! ప్రవీణ్ అని పెడదాము. ఒకవేళ నీమాట చెల్లకపోతే" ప్రవీణా అని పెడదాము. అన్నాడు మోహన్.

"పేరు చాలా బావుందండీ! ' అంటు అతని వక్షస్థలములో ముఖము దాచుకుంది రాధ. అతని బలమైన చేతులు రాధను చుట్టివేశాయి.

మోహన్ తల్లిగారు యశోదమ్మగారు కోడలి కాలు కదపనివ్వటములేదు. ఎంతో ఆపేక్షగా చూస్తున్నారు రోజురోజుకు రాధ మానసికంగానేకాక శారీరకంగాను

మారుతోంది. అనలే నున్నపైన బుగ్గలు నిగనిగలాడు తున్నవి. రాధ వింత అందముతో కళకళలాడు తున్నది.

రెండురోజులనుండి రాధకు జ్వరము వస్తోంది. తగ్గుతూంది. లెమ్మని ఊరుకున్నది. కాని మరునా టికి జ్వరము తీవ్రమైనదికడుపులో విపరీతమైనబాధ.

మోహన్ వెళ్ళి లేడీడాక్టర్‌ను తీసుకవచ్చాడు.

రాధను పరీక్షించిన డాక్టరు బయిటి గదిలోకి వచ్చారు. యశోదమ్మగారు మోహన్ ఆమెననున రించారు.

'రాధకేమైనదమ్మా ! అన్నారు యశోదమ్మగారు డాక్టరమ్మనుద్దేశించి.

'ఆమె గర్భవతని ఎవరు చెప్పారు?' అన్నారు డాక్టరుగారు,

'రాధే చెప్పింది ఇప్పుడునాల్గొనెల యేమైనదమ్మా? అన్నారు. యశోదమ్మగారు ఆతృతగా.

'ఆమె గర్భవతికాదు, కడుపులో ట్యూమర్ వున్నది. ఆపరేషను చేయాలి. ఇప్పటికే లేటయినది అన్నారు డాక్టరుగారు నెమ్మదిగా,

డాక్టరుగారి మాటలు వింటూనే హతాశులైయ్యారు శ్రోతలిద్దరు భయము చేతనో, లేక బాధవల్లనో అపాదమస్తకము వణికిపోతున్నారు యశోదమ్మగారు మోహన్ ముఖములో కత్తివాటుకు నెత్తురు చుక్క లేనట్లయినది,

'ఏమిభయము లేదమ్మా; తగ్గిపోతుంది' అన్నారు డాక్టరుగారు యశోదమ్మగారి నుద్దేశించి.

మెల్లగా తేరుకుంటున్న మోహన్ డాక్టరుగారూ ! మీరు చెప్పింది నిజమేనా? మరి గర్భిణీ స్త్రీలకు కనిపించే సూచనలు కూడా అగుపించాయేమిటి?' అన్నాడు,

"నిజమే చెప్పానండీ! కడుపులో ట్యూమర్ వున్న వాళ్ళకు గర్భిణీ స్త్రీలకుండే లక్షణాలుండాలని యేమి లేదు, కాని ఆమె మనస్సులో ఎప్పుడు అవే ఆలో చనలుండటము వలనా, సైకాలజికల్ ఎఫెక్టుతో ఆమె శరీరములో చూడా అనూచనలు కన్పించాయి, అన్నారు,

'డాక్టరమ్మగారూ ! నా బిడ్డకేమి అపాయము రాకుండా కాపాడండి! నా తల్లి ఈ వార్తనెలా తట్టు కోగలదో!' అన్నారు యశోదమ్మగారు కంటతడి పెడుతూ,

అంతలోనే తలుపుదగ్గర దభేలుమన్న శబ్దము వినిపించగానే ముగ్గురు వెనుతిరిగారు, రాధ క్రింద పడి గిలగిల తన్నుకుంటున్నది.

"రాధా!' అంటూ పరుగెత్తారు తల్లీ కొడుకులు.

డాక్టరుగారు రాధను పరీక్షచేసి "పాపము ఈ అమ్మాయి మన మాటలను విన్నది. తన ఆశ సౌధము కూలిపోయిందని తెలిసి సున్నితమైనమనసు తట్టుకోలేకపోయింది మెంటల్‌షాక్ ఫిట్సు వచ్చాయి. హాస్పిటల్‌లో అడ్మిట్ చేయాలి. ఆలస్యము చేయ కూడదు. నా కారులో తీసుకవెళ్దాము పదండి' అన్నాడు డాక్టరు.

...............

రాధ మెల్లిగాతేరుకుంటున్నది. రాధనుచూచుటకు డాక్టరుగారు వచ్చారు. ఆమెను తమ గదిలోకితీసుకు వెళ్ళారు యశోదమ్మగారు. వాళ్ళ ననుసరించాడు మోహన్.

'డాక్టరుగారూ! రాధకిప్పట్లో ఆపరేషన్ చేయు టకు వీలుగా వున్నదా?" అన్నాడు మోహన్.

"వీలు లేదండీ! ఆమె చాల వీక్‌గా వున్నది. ముఖ్యంగా మళ్ళీ ఫిట్స్‌రాకుండా చూడాలి. కొన్ని రోజులు పట్టవచ్చును" అన్నారు డాక్టరుగారు.

"ఆపరేషన్ తర్వాత పిల్లలు కల్గుటకు వీలుం టుందా" అన్నాడు మోహన్. ఒకవేళ ఆపరేషను తర్వాత పిల్లలు కల్గుటకు వీలుండదేమోననే అనుమా నముచేత.

"సంతానము కల్గటము మన చేతిలో నున్నదా? అదంతా దైవేచ్ఛ! పిల్లలు కల్గకపోయినా పర్వాలేదు అది పదికాలాల పాటు జీవించి ఉండటమే మనకు కావలసింది" అన్నారు యశోదమ్మగారు.

తల్లికి రాధపైనున్న ప్రేమాభిమానాలకు లోలోనే సంతోషించాడు మోహన్.

ఆపరేషను మూలంగా సంతానము కల్గదేమోననే అనుమానము అక్కరలేదు'' అన్నారు డాక్టరుగారు.

డాక్టరు మాటలు విని తృప్తిగా నిట్టూర్చారా యశోదమ్మగారు.

రోజులు గడుస్తున్నవి. రాధ ఆరోగ్యము కొంచెము మెరుగు ఔతోంది రాధ ఎప్పుడు ఏదో ఆలోచిస్తూ శూన్యములోకి చూస్తుండేది. 'ప్రవీణ్-ప్రవీణ్' అంటూ గొనిగేది. ఒక్కోసారి "అబ్బాయే పుట్టాడా? అచ్చం నాన్నలాగే ఉంటాడా!" అంటూ యేడ్చేది.

రాధ బాధను చూచి తనగుండె నెవరో పిండేస్తున్నట్టుగా బాధ పడుతున్నాడు మోహన్. ''రాధా! నీవు దిగులుపెట్టుకోకు. నీవు ముందుకోలుకో నీకు తప్పక అబ్బాయి పుట్టాడు అచ్చం నాలాగే ఉంటాడువాడు నీవు త్వరగా కోలుకోవాలిమరి" అని నమదాయించేవాడు మోహన్.

రాధను కంటికిరెప్పలా. కన్నకూతురిలా చూస్తున్నారు యశోదమ్మగారు.

ఒకరోజు మధ్యాహ్నము భోజనాలయ్యాక యశోదమ్మగారు హాలులో నడుము వాల్చారు. "రాధా? అని పిలుస్తూ స్నేహలత లోపలికి ప్రవేశించింది.

యేదో వ్రాసుకుంటున్న రాధ దాన్ని ప్రక్కన పెట్టి ''రా! లతా! చాలరోజులకు వచ్చావు? అందరూ కులాసా?'' అంటూ గదిలోకి అహ్వానించింది.

'నీవేదో వ్రాసుకుంటున్నావు. అంతరాయము కల్గించానా?' అన్నది స్నేహలత కూర్చుంటూ.

"అబ్బే! అదేమీలేదు" అన్నది రాధ.

రాధ వ్రాయుచున్న కాగితము చూచి బొమ్మ ముడివేసింది స్నేహలత ఆ కాగితములో తనఊహలలోని బాబును చిత్రించింది రాధ.

'చాల బాగా వేశావు రాధా; నీవు బొమ్మలు వేస్తావని నాకు తెలియదు"

''నాకేమి రాదు లతా! అనుక్షణము నా మదిలో జీవించే రూపము గనుక వేయగానే కుదిరింది" అన్నది రాధ దిగులుగా.

రాధను చూస్తుంటే జాలేసింది స్నేహలతకు. కాని అంతలోనే ఆమెలోని స్త్రీ హృదయము భగ్గుమన్నది! ఈ రాధ మూలంగానే కదా! తను మోహన్‌కు కాకుండా పోయింది. తమకున్న చుట్టరికమును కూడా లెక్కచేయక ఎక్కడో స్నేహితుడి పెళ్ళిలో చూచిన రాధను పెళ్ళి చేసుకుంటానని మొండికేశాడు మోహన్. ఈ రాధను చూడకపోతే తను మోహన్‌కు భార్య కావలసింది తల్లి దండ్రులు లేక మేనమామ పంచన బ్రతుకుతున్న రాధ తన సర్వస్వాన్నీ దోచేసుకున్నది. రాధపై చెప్పలేనంత ద్వేషము పుట్టుకొచ్చింది స్నేహలతకు. పైకిదేమి కన్పించనివ్వకుండా "రాధా! ఇప్పుడు అత్తయ్య నిన్ను బాగా చూస్తున్నదా!'' అని ప్రశ్నించింది.

స్నేహలత మాటతో ఆశ్చర్యపోయిన రాధ "అదేమిటి లతా! అత్తయ్య నన్నుచూడకపోతే నేను ఇన్నిరోజులు బ్రతికేదాన్నా! అత్తయ్య నన్ను కంటికి రెప్పలా కాపాడుతున్నారు'' అన్నది.

'రాధా! మనుష్యులెవ్వరు ఒకే రీతిగాఉండరు. ఏ క్షణాన ఎవరిలో యెలాటిమార్పు వస్తుందో చెప్పలేము' అన్నది.

'నాకేమి అర్థము కావటములేదు లతా! అసలు విషయమేమిటో సూటిగా చెప్పు' అన్నది రాధవినుగ్గా

'ఇందులో సూటిగా చెప్పాల్సిందేమి లేదు రాధా! నా మనస్సులోని మాట నీతో అన్నాను. అత్తయ్యకు

పిల్లలంటే ఎక్కడలేని అపేక్ష నిమూలంగా అలాంటి అవకాశము లేదని చెప్పారట డాక్టర్లు' అన్నది రాధ ముఖములోకి నిశ్చలంగా చూస్తూ;

రాధ తలపై పిడుగు పడినట్లయినది. 'లతా! నీ వనేదేమిటి?| నేనూ తల్లిని కాలేనా? నాకు సంతానము కలిగే ప్రాప్తము లేదా? మరి వీళ్ళంతా అబద్ధాలు చెప్తున్నారేమిటి?' అన్నది ఏడుస్తూ.

రాధను చూచి లోలోపల ఆనందించింది. స్నేహలత పైకి మాత్రము 'ఊరుకో రాధా! ఏడ్పు లాభమేమిటి? డాక్టరన్నారట నీకు పిల్లలు కలిగే అవకాశము లేదని. పైగా నీ వ్యాధికి సరియైన క్యూరే లేదట. బావకు మళ్ళీ పెళ్ళి చేయాలని అత్తయ్య సంకల్పము. నీవు జీవించి ఉండగా యింకో పెళ్ళి చేయటమెలా సాధ్యపడుతుందని అత్తయ్య ఇరకాటాన పడ్తున్నారు' అన్నది కన్నీళ్ళు వత్తుకుంటూ.

'నిజమా?' అన్నది రాధ నూతిలోనుండి మాట్లాడినట్లుగా.

'నిజమే రాధా! అత్తయ్యకిలాటి ఆలోచన రావటము అది ఆచరణలోకి వచ్చుట కెంత కాలము? అందుకే అన్నాను. మనుష్యులెప్పుడు ఒకే రీతిగా ఉండరని' అన్నది రాధ ముఖములోకి చూస్తూ.

రాధ చూపులు లత చూపులను తప్పించుకుంటూ శూన్యములోకి వెళ్ళాయి. చలనము లేనట్లు కూర్చుండిపోయింది రాధ. మెల్లగా అక్కడి నుండి తప్పుకున్నది స్నేహలత.

ఎంత సేపటికి కాని బాహ్య ప్రపంచములోకి రాలేకపోయింది రాధ. స్నేహలత మాటలే చెవుల్లో గింగురు మంటున్నవి. రాధకు అత్తగారిపై కాని, భర్తపైకాని లేశమాత్రము కోపము రాలేదు.

మరునాటి ఉదయము రాధ శవము నూతిలో తేలటము చూచి ఇంట్లో వాళ్ళంతా గొల్లుమన్నారు. యశోదమ్మగారు మొదలు నరికిన మ్రానులా కూలిపోయారు. మోహన్ చిన్న పిల్లాడిలా రాధ శవాన్ని పెనవేసుకుని ఏడ్చారు.

o o o

రాధ లేని ఆ ఇంట్లో జీవకళయే మాయమైనది. తల్లి కొడుకులు ఉదాసీనంగా కాలము వెళ్ళబుచ్చుతున్నారు.

ఒక రోజు యశోదమ్మగారు "బాబూ: ఇంకెన్ని రోజులీవిధంగా వుంటావురా? నవు మళ్ళీ పెళ్ళిచేసుకోవలసింది. స్నేహలత తండ్రి కబురు చేశాడు" అన్నారు కొడుకుతో.

తల్లి మాటలు విని పాలిపోయింది మోహన్ వదనము. 'అమ్మా నీవేనా ఈ మాటలనేది? రాధతో నిండిన నా హృదయములో ఇంకొకరికి స్థానమివ్వనా?' అన్నాడు గాద్గికంగా.

'మోహన్! నా హృదయము బ్రద్దలౌతుందిరా! రాధ లేని కొరత మన కెవ్వరూ తీర్చలేరు. అది ఇంట్లో వుండేనే జీవకళ ఉట్టిపడేది. నీవీ విధంగా బాధ పడ్తుంటే దాని ఆత్మకైనా శాంతి లభించదు. నా మాటవిని స్నేహలతను చేసుకోబాబు?' అన్నారు యశోదమ్మ గారు.

'నన్ను ఆలోచించుకో నివ్వమ్మా!' అంటూ తన గదిలోకి వెళ్ళాడు మోహన్.

ఆలోచనలతో మోహన్ మనస్సు వికలమైపోయింది. రాధ మన కన్యాయము చేసి వెళ్ళింది. కాని, తను రాధ కన్యాయము చేసి, రాధ స్థానములో ఇంకొకరిని తీసుకు రాలేడు. తన హృదయములోని రాధ స్థానాన్ని ఎవరు కదలించలేరు. ఏమితోచక రాధతో తను కలిసి తీయించుకున్న ఫోటోలు చూద్దామని ఫొటో అల్బమ్ బయటికి తీసాడు మోహన్. అనుకోకుండా అందులో నుండి ఒక కవరు జారి పడింది. అది రాధ వ్రాసింది. ఆతృతగా చదవటము మొదలుపెట్టాడు మోహన్.

'ప్రియమైన శ్రీవారికి నమస్కరించి వ్రాయునది తల్లిలేని నన్ను స్వంత తల్లిలా చూచుకున్నారు అత్తగారు. ప్రపంచంలో యే భర్త తన భార్యకు ఇవ్వలేని ప్రేమనిచ్చారు మీరు. నేనెంతో అదృష్టవంతురాలినని నన్ను నేను అభినందించు కుంటున్నాను.

స్నేహలత నా కన్ని విషయాలు తెలియచేసింది. డాక్టరు నా కింకా పిల్లలు కలగరని, నా వ్యాధికి నివారణే లేదని తెలియ చేశారట. కాని ఈ విషయాలన్ని నా దగ్గర మరుగుపరిచారు మీరు. అత్తయ్య కోరిక కూడా స్వార్థరహితమే. ఇల్లు పిల్లలతో కలకలలాడాలని ఎవరికుండదు? మీరు మళ్ళీ పెళ్ళి చేసుకొని అత్తయ్య కోరిక నెరవేర్చండి. నేనుండగా ఈ విషయ మెలాగు సాధ్యపడదు. అందుకే ఈ నా నిష్క్రమణ. నేను సంతోషంగా మీ దారి నుండి తప్పుకుంటున్నాను.

నా మూలంగా మీ కెవ్వరికీ యెలాంటి సుఖము లేదని తెలిసికూడ నన్నెంతో ప్రేమగా చూస్తున్నారు. నన్ను దక్కించు కొనుటకు తాపత్రయ పడుతున్నారు. ఎదుటివారి త్యాగాన్ని స్వీకరించేటంతటి మనోబలము, అర్హత వుండాలి కదా? మీ రందరు నా సుఖానికై పాటుపడుతుంటే, నే నొక్కదాన్ని మీ అందరి సుఖానికై యెందుకు ప్రయత్నించ కూడదు? మీ హృదయాల్లో తీరని చిచ్చురగిల్చి వెళుతున్నాను. కాని, ఈ వేదనకు ఉపశాంతి కల్గించే మార్గాన్ని భగవంతుడు చూపకమానడు.

నా చివరి కోరిక యేమిటంటే, మీరు మళ్ళీ పెళ్ళి చేసుకోండి. మీ ఇద్దరికి 'అమ్మాయే పుడుతుంది- అచ్చం నాలాగే ఉంటుంది'. ఆ పాపపేరు ప్రవీణా అని పెట్టండి. మీ రాధ.

ఉత్తరం చదవటము ముగించిన మోహన్ ఆవేశముచేత ఊగిపోయాడు. స్నేహలతా, నీ ఈర్ష్యాద్వేషాలతో ఓ అమాయకురాలి ప్రాణాన్నే బలిగొన్నావా?' అని పళ్ళుకొరికాడు.

'స్నేహలత నీ మీద పగ సాధిస్తాను' అని పిడికిలి బిగించాడు. కాని అంతలోనే అతని పిడికిలి సడలిపోయింది. 'రాధా' అంటూ యేడ్చాడు.

'పిచ్చి రాధా! ఇన్నిరోజులు నాతో కలిసి జీవించి కూడ నన్ను అర్థము చేసుకోలేక పోయావా? నేను పెళ్ళిచేసుకోవాలా? ఆ మాటలు వ్రాయుటకు నీ చేతులెలా వచ్చాయి రాధా! నీవు నా ప్రేమను అర్థం చేసుకున్నది ఇంతేనా? నేను తప్పక పెళ్ళి చేసుకుంటాను రాధా! నీ చివరి కోరిక నెరవేరుస్తాను. ఎవరినో కాదు నిన్నే చేసుకుంటాను. నేనుకూడ చచ్చిపోతాను. మళ్ళి మనిద్దరము జన్మిద్దాము. ఏ జన్మలోనైనా నిన్ను నేను బాగా గుర్తించగలను. వచ్చే జన్మలోకూడ నేనునిన్నే పెళ్ళి చేసుకుంటాను" అంటూ తల్లి గదిలోకి వెళ్ళాడు. ఆమె నిద్ర పోతున్నారు. ఆమెకు గుండెపోటు వచ్చినప్పుడు వాడుతున్న నిద్రమాత్రల సీసా తీసుకొని తన గదిలోకి వచ్చాడు మోహన్.

'రాధా! నేను నీ దగ్గరకే వస్తున్నాను. వచ్చే జన్మలో మనిద్దరికి పెళ్ళి అవుతుంది. మనకు అబ్బాయే పుడతాడు. అచ్చం మనలాగే ఉంటాడుకదూ రాధా!' అంటూ నిద్రమాత్రలన్ని మింగేసి శాశ్వత నిద్రలోకి జారిపోయాడు మోహన్.

X X X